క్లుప్తంగా

ఆర్బీకేలో గడ్డిజొన్న విత్తనాలు

పెదకాకాని: రైతు భరోసా కేంద్రంలో గడ్డిజొన్న విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వెనిగండ్ల వెటర్నరీ అసిస్టెంట్ లోకనాథ్ తెలిపారు. గేదెలు, ఆవుల మేతకు ఉపయోగకరంగా ఉండే గడ్డిజొన్న విత్తనాలు 5 కిలోల ప్యాకెట్ రూ.125గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలానే పశువులకు హెల్త్‌కార్డులు వచ్చాయని, రైతు భరోసా కేంద్రం వద్ద సంబంధిత పశువుల యజమానులు ఈ కార్డులు పొందాలని సూచించారు.

విద్యార్థుల ప్రగతి ఆధారంగా విద్యాబోధన



పాండ్రపాడు(కాకుమాను): విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఉపాధ్యాయులు విద్యాబోధన అందించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని పాండ్రపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ వార్షిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థులను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి సీడీ గ్రూపులలో ఉన్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఏ గ్రూపులోకి తీసుకువచ్చే విధంగా ప్రతి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఎంఈఓ-2 విజయ భాస్కర్, హెచ్ఎం నాగ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు ప్రకాశరావు, సీఆర్పీలు జమాయమ్మ, చలపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం




పొన్నూరు: ప్రజారవాణా సంస్థ పొన్నూరు డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించారు. దొప్పలపూడి గ్రామానికి చెందిన కె.నాగేశ్వరావు, ఎస్.చంద్ర శేఖర్, ఎస్.రమేష్ బాబు మన్నవ మీదుగా కొల్లిమర్లకు బస్‌సౌకర్యం కల్పించాలని కోరారు. బాపట్ల, చీరాల మీదుగా తిరుపతికి నైట్ సర్వీస్ ఏర్పాటు చేయాలని పొన్నూరు నుంచి షేక్ ఖాజా కోరారు. వేటపాలెం నుంచి పొన్నూరు – గుంటూరుకు బస్సుల సంఖ్య పెంచాలని వేటపాలెంకు చెందిన వెంకటేశ్వర్లు కోరారు. భట్టిప్రోలు మీదుగా ఇంటూరు, చెరుకుపల్లి రేపల్లెకు ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేయాలని పొన్నూరుకు చెందిన రవి కోరారు.

జొన్నలగడ్డలో పంట కోత ప్రయోగం



గుంటూరు రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిపంటలో దిగుబడి అంచనాలకోసం పంట కోత ప్రయోగం చేయటం జరిగిందని వ్యవసాయ శాఖ ఎస్‌ఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన పంట కోత ప్రయోగంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 4 వరి పంటల్లో పంట కోత ప్రయోగాలు చేయటం జరిగిందన్నారు. ఒక్కొక్క పంటలో వచ్చిన దిగుబడి వివరాల ప్రకారం ఎకరానికి 5.5 మీటర్ల పంటను కోసి ప్రయోగం చేయగా పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని తెలిపారు. గత ఏడాదికంటే తక్కువ దిగుబడి కనిపించిందన్నారు. ఏఎస్‌ఓ సుబ్బయ్యశర్మ, వీఏఏ వి.ఆనందబాబు, ఇన్స్యూరెన్స్ ఆఫీసర్ కె.నవీన్, రైతులు వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ మహిళకు అప్పగింత



పట్నంబజారు: బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పజెప్పిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఈస్ట్ ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... విజయపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం గుంటూరు మార్కెట్‌కు వచ్చింది. ముందుగా బ్యాంకుకు వెళ్లి బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ. 2 లక్షల నగదు, కొంత బంగారంతో మార్కెట్‌కు వచ్చి పనులు చూసుకుని ఆటోలో వెళుతుండగా చేతి బ్యాగ్ తెగి కింద పడిపోయింది. గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు విషయాన్ని ఎస్ఐ షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మహిళ ఆచూకీ గుర్తించిన పోలీసులు ఆ బ్యాగును తిరిగి ఆమెకు అందజేశారు.

సంక్షేమమే ప్రభుత్వ అజెండా

- వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కన్వీనర్ యు.మురళి
- నడింపాలెంలో 'పల్లెకుపోదాం'



నడింపాలెంలో సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: సంక్షేమమే అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కన్వీనర్ ఉద్దగిరి మురళి అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం-1 గ్రామ సచివాలయంలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు సభలో ప్రజలకు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల ప్రదర్శన శిలా ఫలకాన్ని సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, ఈఓపీఆర్డీ మావులూరి మోషెలు ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ ప్రజల కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీపై ప్రజల్లో రోజురోజుకీ అభిమానం రెట్టింపవుతుందన్నారు. ప్రజలంతా మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసిమళ్ల మాణిక్యరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కన్నా అక్కిరాజు, వాసిమళ్ల అమృతయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యం..

గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్ సీపీ అర్బన్ క్లస్టర్ 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 47వ డివిజన్ 184వ సచివాలయం పరిధిలో డివిజన్ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబు ఆధ్వర్యంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్టికను ఆవిష్కరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు బి.శివయ్య, తాళ్ళ రాజేష్, వెంకటేశ్వర్లు, కిషోర్, ప్రసాద్, దుపాల రాద, లక్ష్మి, అంకమ్మరావు, రాచకొండ ముత్యాలనాగరాజు, అంకరావు, లబ్ధిదారులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



47వ డివిజన్‌లో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పొన్నూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉప్పరపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పొన్నూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఉప్పరపాలెం గ్రామ సర్పంచ్ ముద్రబోయిన తిరుపతయ్య అన్నారు. మండలంలోని ఉప్పరపాలెంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. తౌలుత గ్రామంలోని వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో గ్రామంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సభలో పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికలలోనూ ఆశీర్వదించాలని కోరారు. మండల మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్, మనోహర్, నాగప్రసాద్, ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, గృహ సారథులు పాల్గొన్నారు.

తెగుళ్ల బారి నుంచి మిర్చిని కాపాడుకోండి..!

- మిర్చి ఫైరులో గొర్రుతో అంతరకృషి చేయాలి
- ఉద్యాన అధికారి ఎం. బేబి

ప్రత్తిపాడు: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మిర్చి పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడునేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ఉద్యాన అధికారి ఎం.బేబి అన్నారు. సస్యరక్షణ పద్ధతులను వివరించారు. తుపానుకు దెబ్బతిని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మిర్చి పొలాలను పరిశీలించిన అనంతరం హెచ్ఓ మిర్చి రైతులకు పలు సూచనలు చేశారు.

- అధిక తేమ వలన వేర్లు ద్వారా మొక్క అవసరమైన పోషకాలను తీసుకోలేదన్నారు. పంటను పురుగులు, తెగుళ్లు ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనబడే అవకాశం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు పాటించి పంటను రక్షించుకుని, పంట నష్టాన్ని కొంతమేరైనా తగ్గించుకోవాలని సూచించారు.
- వాలిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఉంచాలని, ఉరకెత్తి తలలు వాల్చితే తేరుకునేందుకు లీటరు నీటికి పది గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు.
- వడలిన మొక్కలకు లీటరు నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేటు కలిపిన ద్రావణంగా పిచికారీ చేయాలని, ఇనుపధాతు లోపంతో మొక్కలు పాలిపోతే పది లీటర్ల నీటికి యాభై గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మచెక్క రసం కలిపి పిచికారీ చేయాలని కోరారు.
- పైపాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 200 కిలోల వేపపిండి పొలంలో వేయాలని, నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతరకృషి చేయాలని సూచించారు.
- మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని (ఐదు గ్రాములు లీటరు నీటికి) మరియు, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని (2.5 గ్రాములు లీటరు నీటికి) ఒకదాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2 నుండి మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు.
- బ్యాక్టీరియా ఆకుమచ్చ, కానోఫొరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, ముందు జాగ్రత్త చర్యగా పది లీటర్లు నీటికి ముప్పై గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి తెగుళ్ల వ్యాప్తిని అరికట్టుకోవచ్చని మిర్చి రైతులకు వివరించారు.



మొక్కలను పరిశీలిస్తూ రైతులకు జాగ్రత్తలను వివరిస్తున్న ప్రత్తిపాడు ఉద్యాన అధికారి ఎం.బేబి

ఆర్‌వీఆర్‌జేసీలో విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్ వెలుగు ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం చొడవరం గ్రామంలోని కళాశాల ఐఐసీ సహకారంతో రెన్యూవబుల్ ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో ఎనర్జీ కన్సర్వేషన్ అండ్ ఇన్నోవేటివ్ పేరుతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని భావితరాలకు భవిష్యత్తును అందించేందుకు కృషిచేయాలన్నారు. జోసిల్ లిమిటెడ్ కంపెనీ ప్రొడక్షన్ అడ్వైజర్ ఆర్.బెనర్జీబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంధన శక్తి ప్రాముఖ్యతను, వాతావరణ మార్పుల్లో దాని ప్రభావాన్ని భవిష్యత్తులో ఇంధన శక్తి కొరత ఏర్పడకుండా పొదుపు సామర్థ్యం పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలను చేసి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ సీవీ సుబ్రమణ్యం, డాక్టర్ కె.చంద్రశేఖర్ ఉన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఏఈఎల్‌సీ ఆస్తులు పరిరక్షించాలి

నెహ్రూనగర్: అన్యాక్రాంతమవుతున్న ఏఈఎల్‌సీ ఆస్తుల్ని పరిరక్షించాలని కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో టీడీపీ నాయకులు, ప్రైవేటు వ్యక్తుల వల్ల ఏఈఎల్‌సీ ఆస్తులు సగానికి పైగా అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన ఆస్తుల్ని కూడా కాజేసేందుకు కుయుక్తులు పన్నుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు కె. హెబెల్, ఎం. శ్యాంసన్, కె. జయసుధ, టి. జయరత్నం, కె. ఏసుపాదం, నల్లపు నీలాంబరం, పి. శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్‌లో ఏఈఎల్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యుల ప్రదర్శన

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామనామక్షేత్రం సమీపంలో గురువారం ఉదయం భాస్కరరావు, వెంకటశివ నాగరాజు 400 కిలోల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల వేంకటేశ్వరాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార కల్యాణ మహోత్సవాలు గురువారం కనులపండుగగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామివారు వరాహావతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి కళ్యాణ మహోత్సవం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదం భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు ఉన్నారు.

స్వాములకు చద్ది వితరణ



గుంటూరు రూరల్: దేవుని సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని గోరంట్ల గ్రామంలోని దేవాలయాల కమిటీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ తెలిపారు. గత 31 రోజులుగా గ్రామంలోని అభయాంజనేయస్వామి, షిరిడీ సాయినాథుని ఆలయంలో జరుగుతున్న అయ్యప్పలు, స్వాముల చద్ది వితరణ కార్యక్రమం గురువారం కొనసాగింది. చద్ది వితరణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 31 రోజులపాటు స్వాములకు చద్ది వితరణ చేపట్టటం జరిగిందన్నారు. ప్రతి రోజు సుమారు 400-500 మంది స్వాములకు వితరణ చేయటం జరిగిందని తెలిపారు. 41 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని మాల ధరించిన ప్రతి స్వామి ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. చిల్లర శ్రీనివాసరావు, చల్లా నాగరాజు, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఉప్పు చిట్టి భక్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యను కలసి సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా నియమితులైన బండ్లమూడి భానుకిరణ్

– పొన్నూరు

19న వృక్షశాస్త్ర విభాగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల విశ్రాంత వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్. రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 19న వృక్షశాస్త్రంలో అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ, డిజిటల్ పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీలకు హాజరు కావచ్చునని, విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 16లోపు తమ పేర్లను వాట్సాప్ ద్వారా నమోదు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 94407 12410 నంబర్లో కన్వీనర్ డాక్టర్ జి. రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి సహస్ర చండీ యాగ మహోత్సవాలు

శివాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



విష్ణుభట్ల ఆంజనేయ చైనులు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథశ కుండాత్మక(7) సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మీ గణపతి మహాయాగాలు జరిపిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయ చైనులు పర్యవేక్షణలో ఈనెల 15వ తేదీ నుండి 20 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతిహోమం, చండీ పారాయణాలు, అఖండ దీపారాధన, జపాలతో మొదలైన్న వైదిక క్రతువు 20వ తేదీ బుధవారం మహామంగళ పూర్ణాహుతి, వంశోద్ధార, యజ్ఞరక్షా ధారణ, వేదాశీర్వచనం, ఋత్విక్కులకు సన్మానం, మంగళహారతి, వందన సమర్పణ, విరామ సమర్పణ జరుగుతుందన్నారు. విరామ సమయాల్లో పండితులచే ధార్మిక ప్రసంగాలతో యాగ కార్యక్రమాలు పూర్తి అవుతాయని విష్ణుభట్ల తెలిపారు. ఆరు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమములు జరుగుతాయన్నారు. ఈ యాగాల్లో భాగంగా 6 రోజులు ప్రాతః కాలము, సాయంకాలాల్లో చండీ పారాయణం, చండీహోమం, వనదుర్గా పారాయణ, వేదపారాయణ, లక్ష్మీగణపతి మహామంత్ర జపానుష్టానములు, శ్రీ రుద్ర పారాయణాలు, లలితా సహస్ర నామపారాయణాలు, సూర్యనమస్కారాలు, అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో విశేషంగా భక్తులు పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించి జగన్మాత అనుగ్రహానికి పాత్రులు కావలసినదిగా ఆలయ సహాయ కమిషనరు ఎన్.శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు భక్తులకు తెలియజేశారు.



సహస్ర చండీ మహాయాగ మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచాలి

హెచ్ఎంలతో సమావేశంలో ఎంఈఓ సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: సెమిస్టర్ 2 నాటికి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింతగా మెరుగుపరచాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం యూడైస్‌పై ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ నాటికి యూడైస్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలతో పాటు ఉపాధ్యాయుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి యూడైస్ ఎంతో కీలకమని, ఎలాంటి అలసత్వం లేకుండా త్వరితగతిన నమోదు చేయాలన్నారు.

80 శాతంపైన గోరుముద్ద తినేలా..

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనభై శాతంపైన విద్యార్థులు ప్రతిరోజూ ఖచ్చితంగా జగనన్న గోరుముద్ద తినేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రమాదేవి ఆదేశించారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వర్క్‌బుక్స్ కరెక్షన్లు చేయాలని, సిలబస్ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఈ నెల 16వ తేదీన అన్ని స్కూళ్లలో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గోరుముద్ద అమలు విషయంలో, నాణ్యతలో ఎలాంటి రాజీ ధోరణి అవలంభించవద్దని హెచ్ఎంలకు స్పష్టం చేశారు. ఎంఈఓ-2 లీలారాణి, హెచ్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సీహెచ్ రమాదేవి, పక్కన ఎంఈఓ-2 లీలారాణి

రేపు పెదపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి

- 332 మందికి కళ్లజోళ్లు పంపిణీ
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కొరిటెపాడు: దృష్టి లోపం సమస్య మాత్రమే కాదని, మనిషికీ, ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేసే దిశగా బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్టు భజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలం, పెదపాలెంలో ఈనెల 13న భజరంగ్ జగన్ నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి వైద్యశిబిరంలో అవసరమైన 332 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. పెదపాలెంలో శనివారం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. బజరంగ్ నేత్ర జ్యోతి శిబిరంలో కళ్లజోడు ఆవశ్యకత ఉన్నవారు అందుబాటులో ఉండి, వాటిని పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

ఫెన్సింగ్‌లో కిట్స్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సృజన్ సిన్హా ఫెన్సింగ్ క్రీడలో బంగారు పతకాన్ని సాధించాడు. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో సిన్హా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. ఆ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో చైర్మన్ సృజన్ సిన్హాను అభినందించారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఔరంగాబాద్‌లోని ఎంజీఎం యూనివర్సిటీలో జరగనున్న అంతర్జాతీయ విశ్వవిద్యాలయ పోటీల్లో కూడా సిన్హా పాల్గొననున్నాడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, క్రీడాచార్యులు కె.వెంకట్రావు, సీహెచ్ విశ్వనాథ్ సాయిలను చైర్మన్ ప్రశంసించారు.



సృజన్ సిన్హాను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

నేటి నుంచి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం

పాత గుంటూరు: ఏలూరు బజారు శ్రీ కోదండ రామ మందిరం వద్ద శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో 15 నుంచి 17 వరకు సహస్ర కలశ అభిషేకాలు, అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నాళం శివప్రసాద్ తెలిపారు. వేదిక ప్రాంగణంలో గురువారం ఉత్సవ ఆహ్వాన పత్రిక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో శివప్రసాద్ మాట్లాడుతూ 15న ఉదయం 8:10 నిమిషాలకు అష్ట ద్రవ్య మహాగణపతి హోమం, సాయంత్రం సహస్ర కలశ పూజ, ప్రధాన ఉదయం సహస్ర కలశ అభిషేకాలు, 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో స్వామికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు 18 రకాల పూలతో అభిషేకాలు, శ్రీ అయ్యప్ప స్వామి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం ఉంటాయని తెలిపారు. అనంతరం అయ్యప్ప, భవానీలు, భక్తులకు భిక్ష ఉంటుందని చెప్పారు. 17న అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నామని, భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో డి.వి. రవి కుమార్, జుజ్జూరు శ్రీనివాసరావు, దేవతి శివకుమార్ పాల్గొన్నారు.